

# పిల్లలున్న ఇల్లు

పైడికొండల వెంకటేశ్వరరావు

"రంగారావుగారి లాంటి వ్యక్తులు కథల్లోనూ, సినిమాల్లోనూ ఎక్కువగా కనిపిస్తుంటారు గానీ నిజజీవితంలో మాత్రం చాలా అరుదుగా కనిపిస్తుంటారు.

అన్ని విధాలా చాలా సంతృప్తికరమైన జీవితం రంగారావు గారిది. తండ్రి సంపాదించి పెట్టిన ఆస్తివుంది. ఏ వ్యసనమూలేని క్రమశిక్షణగల జీవితం వుంది. అందుకే చాలా మంచిజీవితాన్ని గడిపారాయన. ఆయనకిప్పుడు యాభై ఏళ్లు. ఆయన కొడుక్కీ, కూతురికీ పెళ్లిళ్లు అయిపోయాయి.

కొడుకూ, కోడలూ, వాళ్లపిల్లల్తో కలిసి లంకంత ఇంటిలో చాలా ఆనందంగా గడిపేస్తున్నారాయన.

అలాంటి రంగారావు గారికి ఇప్పుడో సమస్య వచ్చిపడింది.

ఆయన వయసు యాభైఏళ్లయినా ఆయన ఒంట్లో ఇంకా చాలా శక్తివుంది. ఆయన రక్తంలో వేడివుంది. మనసులో ఉత్సాహం వుంది. అలాం

టాయనకి 'కోరిక' ఉండటంలో ఆశ్చర్యం ఏముంది?

ఆయనకి కోరిక వుంది. ఆ వయసులో కూడా ఆయనకి తగ్గట్టు నడుచుకుంటూ, ఆయనంత ఉత్సాహంగానూ ఆయనకి సహకరించే భార్య ఉంది.

అంతా బాగానేవుంది కానీ ఆ ఇంట్లో ఆయన 'కోరిక' తీరడానికి తగిన వాతావరణమే లేదు. అదే ఆయన సమస్య.

పగలయితే కోడలూ, పిల్లలూ ఇంట్లోనే వుంటారు. వాళ్ల ఎదురుగా తాము గదిలో దూరి తలుపులు బిడాయించుకుంటే ఎంత అప్రతిష్ట? ఈ వయసులో ఆ సరసాలేమిటని నలుగురూ నవ్విపోరూ!

ఇక రాత్రయితే పిల్లలు ఆయన గదిలోకే చేరిపోతారు.

చీమ చిటుక్కుమంటే చాలు నిద్రలేచిపోయే వాళ్లమధ్యన...ఎలా?

పిల్లల్ని వేరే గదిలో పడుకోబెడుతుంటే కోడల్ని వద్దని వారించి తమ గదిలో పడుకోబెట్టేలా అలవాటు చేసింది ఆయనే. వాళ్లిలా తమపాలిట సెన్సారాఫీసర్లవుతారని ఆయన అప్పట్లో ఊహించలేకపోయాడు"

...చదువుతున్న పత్రిక మూసి నిట్టూర్చారు రాఘవరావుగారు.

"అచ్చం నా కథనే పాత్రల పేర్లు మార్చి వ్రాసినట్టు వ్రాశాడు ఆ రచయిత ఎవరో?" అనుకున్నారాయన.

ఆయనదీ అదే కథ. అదే వ్యథ.

ఆ కథలోని రంగారావులా రాఘవరావు గారికి బోల్డంత ఆస్తి లేదుకానీ అతనిలాగే బోల్డంత 'కోరిక' ఉంది. కానీ ఏం లాభం?

అతని ఇల్లులాగానే ఆయనిల్లూ అనుకూలంగా లేదు. రాఘవరావుగారింట్లో, రంగారావు ఇంట్లో వున్నట్టే కొడుకూ, కోడలూ, ముగ్గురు పిల్లలూ ఉన్నారు. మరో ఇద్దరు పగలంతా పక్కింట్లోంచి ఊడిపడతారు.

మరోసారి నిట్టూర్చి, పత్రిక తెరచి కథ చదవడం పూర్తిచేశారు రాఘవరావుగారు.

"కథలోని రంగారావు అదృష్టవంతుడు. ఆస్తి వుంది గనుక ఎంచకా సెకండ్ హనీమూన్ పేరుతో జల్సాగా తిరిగివచ్చాడు. కానీ నాకంత 'సీను' ఎక్కడుంది?" అనుకుని మళ్లీ నిట్టూర్చారాయన.

★ ★ ★




శ్రీధర్ : మా ఆవిడ గొప్ప డబ్బుల పొదుపరిరా!
నగేష్ : ఎలారా?
శ్రీధర్ : ఏవుందీ, ఇద్దరు పిల్లల్ని ఒకే సారి కని హాస్పిటల్ ఖర్చు డబ్బులు ఆదాచేసింది.

కొచ్చెర్ల గంగాధర్
విజయవాడ

"అబ్బ! ఉండండి. ఇంత వయసొచ్చినా..."

"బిగువు ఏమాత్రం తగ్గలేదంటావ్. అంతేనా"

"ఛీ! సిగ్గులేదంటున్నాను"

"కొత్తగా పెళ్లయిన జంటలగ్గానీ మనకెందుకోయ్ సిగ్గు"

"సిగ్గులేకపోతే సరి. పిల్లలున్న ఇంట్లో చాలా జాగ్రత్తగా ఉండాలని ఎన్నిసార్లు చెప్పినా మీరు వినిపించుకోరుకదా. పిల్లలు పెద్దవాళ్ల ప్రవర్తనని జాగ్రత్తగా గమనించి అనుకరిస్తుంటారు. అలాంటిస్థితిలో మనం మన సుఖాల కోసం కక్కుర్తిపడి వాళ్లకి కనబడకూడని విధంగా కనిపించామంటే వాళ్లూ అవే పనులు చేస్తారు"

"నీ మొహం. ఏంటి వాళ్లు చేసేది"

"మీరలాగే అంటారు. మీకు తెలీదు ఊరుకోండి. పాపం కోడలు వంటింట్లో ఒక్కతే తంటాలు పడుతోంది" అంటూ వెళ్లిపోతున్న భార్యవైపు అలాగే చూస్తూ ఉండిపోయాడు రాఘవరావుగారు.

కాస్సేపటికి తల విదిలించి లేచారు. ఎప్పుడూ జరిగే సన్నివేశమే అది.

"ఏంటో! దాందంతా అదో పిచ్చి. ఇంట్లో పిల్లలుంటే మాత్రం ఏమిటి?" అనుకున్నారాయన.

★ ★ ★

భోజనం పూర్తిచేసి బెడ్రూంలోకి వచ్చిన రాఘవరావుగారు భార్యకోసం ఎదురు చూస్తూ కూర్చున్నారు.

"ఇవాళ ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేసేదిలేదు. రాజేశ్వరి మాట వినేది లేదు" అనుకున్నారు ధృడంగా.

పావుగంట తర్వాత ఆ గదిలోకి వచ్చింది రాజేశ్వరిగారు.

ఆయన ఆవిడకి దగ్గరకంటూ జరిగారు.

ఆమె కాస్త వెనక్కి జరిగింది "ఎన్నిసార్లు చెప్పినా మీరు వినరు కదా!" అంది.

"ఏమిటి? దగ్గరగా కూడా కూర్చోకూడదా?!"

"చెప్పానుగా, పిల్లలు మనల్ని గమనిస్తూ వుంటారని"

"నీ చాదస్తం మండిపోనూ..." అంటూ ఆమె దగ్గరకంటూ జరిగి ఆవిడని కౌగిలించుకుని ముద్దు పెట్టుకున్నారాయన.

అంతే! చటుక్కున ఆవిడ్ని వదిలేసి సర్దుకుని కూర్చున్నారు వెంటనే.

కారణం...వాళ్ల మనవడు ప్రణీత్ తుర్రుమంటూ లోపలికొచ్చి హఠాత్తుగా నిలబడిపోయి బొమ్మలా వాళ్లవైపు చూస్తూ నిలబడ్డాడు.

"రారా ప్రణీత్! ఇవాళ నీకో కొత్త కథ చెబుతాను" అంటూ చేతులు సాచారాయన— కాస్త ఇబ్బంది పడుతూనే.

★ ★ ★

పిల్లలు పిల్లలుంటూ భార్య చెప్పే మాటల్ని ఎప్పుడూ పట్టించుకోని రాఘవరావుగారికి ఆ మర్నాటినుంచీ పట్టించుకోక తప్పలేదు.

కారణం ఏమిటంటారా?!

ఆ మర్నాడు ఆయన సాయంత్రం బయటకెళ్లి తిరిగి ఇంట్లోకి వచ్చేసరికి వంటగదిలోంచి కోడలు మాటలు వినబడుతున్నాయి.

"తప్పు ప్రణీత్! పిల్లల్ని ముద్దు పెట్టుకోవాలనుకుంటే బుగ్గమీద ముద్దు పెట్టుకోవాలి. పెదవుల మీద ముద్దు పెట్టుకోకూడదు. ఏం? తెలిసిందా?"

"ఎందుకు పెట్టుకోకూడదు?"

"తప్పన్నానా!"

"ఎందుకు తప్పు? తాతయ్య నానమ్మని అలాగే ముద్దుపెట్టుకున్నాడుగా"

★